క్లుప్తంగా

ప్రత్యేక ఆకర్షణగా అండర్ వాటర్ టన్నెల్



టన్నెల్ అక్వేరియంను తిలకిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఏయూ క్యాంపస్: పర్యాటక రాజధానిగా విరాజిల్లుతున్న విశాఖ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా అండర్ వాటర్ టన్నెల్ ఎగ్జిబిషన్ నిలుస్తుందని మేయర్ జి.హరివెంకట కుమారి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆమె బీచ్ రోడ్డులోని ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్వేరియంలో మాత్రమే చేపల్ని చూసిన నగరవాసులకు ఇది కొత్త అనుభూతిని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకుడు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం నేడు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్ కేంద్రంగా నిర్వహిస్తున్న సేవా స్ఫూర్తి అసోసియేషన్ భవనంలో ధాన్ ఫౌండేషన్, అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరగనుంది. మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులతో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అసోసియేషన్ భవనంలో శిబిరం నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 25 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ తదితర వాటికి స్క్రీనింగ్ టెస్టులు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోడి పందాల శిబిరంపై దాడి

ఆరిలోవ: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి శాంతినగర్‌లో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆరిలోవ పోలీసులు మంగళవారం దాడి చేశారు. మందస్తు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సుమారు పది పందెం కోళ్లు, ఐదు ద్విచక్ర వాహనాలతో పాటు నిర్వాహకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

పేదలకు ఆహారం పంపిణీ



పేద పిల్లలకు ఆహారం అందిస్తున్న సద్గుణ్

బీచ్ రోడ్డు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాట్ ఫారం 65 ఆధ్వర్యంలో నగరంలోని పేదలకు మంగళవారం ఆహారం పంపిణీ చేశారు. సెల్‌బ్రేటింగ్ యూనిటీ, న్యూరిషింగ్ కమ్యూనిటీ పేరుతో నగరంలో 1000 మంది పేదలకు ఆహారం పంపిణీ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఎండీ సద్గుణ్ తెలిపారు.

మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దారుగా అర్జునరావు

మహారాణిపేట: మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వి.అర్జునరావుకు బాధ్యతలు అప్పగించారు. తహసీల్దార్ కె.రమామణికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించిన సంగతి తెలిసిందే. సుజల స్రవంతి ప్రాజెక్టు(అనకాపల్లి)కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులవడంతో ఆమెను రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె మంగళవారం రిలీవ్ అయ్యారు. అదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వి.అర్జునరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

సంతతో తప్పని చింత!



ఆరిలోవ ప్రధాన రహదారిపై ఏర్పాట్లు చేసిన దుకాణాలు



సంత మధ్యలో నుంచి వెళ్తున్న వాహనాలు

- ఆరిలోవ రోడ్డు మధ్యలో షాపుల ఏర్పాటు
- వాహన చోదకుల రాకపోకలకు అవస్థలు

ఆరిలోవ: ఆరిలోవలో జరుగుతున్న వారపు సంత మళ్లీ తిప్పలు మొదలయ్యాయి. రోడ్డుపై అస్తవ్యస్తంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రోడ్డు మధ్యలో పాదచారులు సైతం నడవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ బాలాజీనగర్ నుంచి పాత ఆరిలోవ, దుర్గాలమ్మ గుడి, అంబేడ్కర్ కూడలి వరకు ప్రతి మంగళవారం సంత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. కూరగాయలతో పాటు అన్ని రకాల వస్తువులు ఈ సంతలో విక్రయిస్తుంటారు. ఈ ప్రాంతంలో రైతుబజార్ లేకపోవడంతో ఈ సంత ప్రాధాన్యత సంతరించుకుంది. అటు డెయిరీఫారం నుంచి ఇటూ కొండవాలు ప్రాంతాలు, దీన్‌దయాల్ పురం, ఆరిలోవ కాలనీ నుంచి జనం ఇక్కడికి వచ్చి కూరగాయలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఆనందపురం నుంచి రైతులు, వ్యాపారులు తాజా కూరగాయలు తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తుంటారు. అందుకే ఈ సంత కోసం స్థానికులు ఎక్కువగా ఎదురు చూస్తుంటారు.

మళ్లీ గీత దాటుతున్నారు..

ఈ సంత అటు బాలాజీనగర్ నుంచి ఇటు అంబేడ్కర్ విగ్రహం వరకు విస్తరించింది. మరో పక్క దుర్గాలమ్మ గుడి నుంచి ముస్తఫాకాలనీ వరకు షాపులు నిర్వహిస్తున్నారు. సుమారు 300కు పైగా షాపులు ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ కూరగాయలు, నిత్యావసర వస్తువులు కొనడానికి వచ్చిన వినియోగదారులతో సంత ప్రతి వారం కిటకిటలాడుతుంటుంది. సంతకు వచ్చిన జనం మధ్య నుంచే సిటీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించడానికి పరిస్థితి దారుణంగా తయారైంది. రెండేళ్ల క్రితం అప్పటి సీఐ కిశోర్‌కుమార్ ఆంక్షలు విధించారు. రోడ్డుకు ఇరువైపులా మూడు అడుగుల వరకు గీతలు గీయించారు. ఆ గీతలు దాటకుండా షాపులు ఏర్పాటు చేయించారు. ఎవరైన గీత దాటితే జరిమానా విధించి వారిపై కేసులు నమోదు చేశారు. ఆ గీత లోపలే వినియోగదారులు కూడా నిలబడి కొనుగోలు చేసుకోవాలి. వాటి పరిశీలనకు కానిస్టేబుళ్లు అక్కడ విధులు నిర్వహించేవారు. దీంతో సంత జరుగుతున్న సమయంలో కూడా రోడ్డు మధ్యలో ఖాళీ ఉండేది. వాహనాల రాకపోకలు సజావుగా సాగేది. ఇప్పుడు ఆ పరిస్థితి మళ్లీ మారిపోయింది. ప్రస్తుతం సంత నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి సంత నిర్వహణ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా అప్పలమ్మ పండగ



అమ్మవారికి నమస్కరిస్తున్న విజయనిర్మల

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు చిన వాల్తేర్ రజక వీధిలో కొలువుదీరిన అప్పలమ్మ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మువ్వల సురేష్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పండగకు రజక వీధి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి భక్తుల దర్శించుకొనేందుకు, పూజలు చేసేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. దీంతో పాటు పరస సందర్భంగా పెద్ద ఎత్తున వివిధ రకాల ఉత్పత్తులు విక్రయించారు. దీంతో చినవాల్తేర్ కూడలి నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు రహదారి భక్తులు, విక్రయదారులతో కిక్కిరిసింది. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

26న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 26న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాల అమలు



గణబాబునగ్ కాలనీలో వృద్ధురాలితో మాట్లాడుతున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసమే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డు కొండవాలు ప్రాంతం బీసీ కాలనీ, గణబాబునగర్, సూర్యతేజా నగర్‌లో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఆ పార్టీ స్థానిక నాయకులతో కలసి మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లో అక్కరమాని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ముద్రించిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. వాటి ద్వారా కలిగే లబ్ధిని వివరించారు. అనంతరం స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కరమాని మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందడంతో పాటు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గూడు లేనివారికి నియోజకవర్గంలో సుమారు 30 వేల మందికి ఇళ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం



రక్తదానం చేస్తున్న మహిళా పోలీస్ దివ్యవాణి

ఆరిలోవ: అత్యవసర పరిస్థితిలో ఓ యువతికి రక్తం అందించి నగర పోలీసులు తమ ఔదార్యం చాటుకున్నారు. అనకాపల్లి జిల్లా మెల్లిపాక గ్రామానికి చెందిన సీహెచ్.సాయి అనే 19 ఏళ్ల యువతి అప్లాస్టిక్ అనీమియా అనే సమస్యతో బాధపడుతోంది. ఆమె తల్లిదండ్రులు వైద్యం కోసం ఆరిలోవ హెల్త్ సిటీలో పినాకిల్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె చికిత్సకు రక్తం అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న నగర పోలీసులు రక్తదానానికి ముందుకొచ్చారు. సైబర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు జి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, కె.దివ్యవాణితో పాటు విశ్రాంత హెచ్‌సీ జె.శ్రీనివాసరావు రక్తదానం చేసి ఆ యువతికి అందించారు. దీంతో యువతి తల్లిదండ్రులు నగర పోలీసులు చేసిన నిస్వార్థ సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

వాణిజ్య శాస్త్రంలో నూతన పోకడలపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: వాణిజ్యశాస్త్రం, మేనేజ్‌మెంట్ విభాగంలో చోటు చేసుకుంటున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆకలింపుచేసుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కృష్ణా కళాశాలలో వాణిజ్యశాస్త్రం, మేనేజ్‌మెంట్‌లో మార్పులపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాణిజ్యశాస్త్రంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం నైజీరియా స్కైలైన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య అజిత్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ విభాగంలో వచ్చిన మార్పులను వివరించారు. న్యూఢిల్లీకి చెందిన శారదా యూనివర్సిటీ ప్రొఫెసర్ బర్‌బాస్ మాట్లాడుతూ వాణిజ్య శాస్త్ర అనుబంధ రంగాల విశిష్టతలను తెలియజేశారు. ఏయూ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింగరావు మాట్లాడుతూ కామర్స్ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, కళాశాల కామర్స్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి, సెమినార్ ఆర్గనైజర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, పర్యాటక ప్రాంతాల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ శ్రీకాంత్

ఏయూ క్యాంపస్: నగరంలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న జీ–20 సదస్సులో భాగంగా పెద్ద సంఖ్యలో విదేశీ ప్రతినిధులు నగరానికి విచ్చేసి వివిధ ప్రాంతాలలో బస చేయనున్నారు. సమావేశ నిర్వహణ, భద్రత దృష్ట్యా నగర సీపీ సీహెచ్.శ్రీకాంత్ నగరంలోని పలు హోటళ్లు, పర్యాటక ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. ఏడీజీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ అయ్యనార్, విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, ఎస్పీ(అల్లూరి జిల్లా) ఎస్.సతీష్‌కుమార్ తదితరులతో కలసి నగరంలో హోటళ్లు, పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. సెక్యూరిటీ ఆడిట్‌ను ఈ సందర్భంగా నిర్వహించారు.

ఏయూ సమాచారం..

తెలుగు విభాగం సందర్శన



తెలుగు విభాగం వద్ద డాక్టర్ లక్ష్మీపార్వతి, ఆచార్యులు, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాన్ని మంగళవారం తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి సందర్శించారు. ఆమెతో పాటు రెక్టార్ ఆచార్య కె.మమత పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో మమేకమయ్యారు. తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యత, సంస్కృతి సంప్రదాయాలను రక్షించవలసిన ఆవశ్యకతను లక్ష్మీపార్వతి వివరించారు. విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ వయస్సులో తప్పటడుగులు వేయటానికి ఎక్కువ అవకాశం ఉంటుందని, అందుకోసం మనస్సు సాహిత్యం వైపు మరల్చి చక్కగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, తెలుగు ఆచార్యులు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), బోధనేతర సిబ్బంది, పరిశోధక, స్నాతకోత్సవ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచార్య వెంకటేశ్వర్లుకు ఘన నివాళి



సంస్మరణ సభలో పాల్గొన్న వక్తలు

ఏయూ క్యాంపస్: అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య వెంకటేశ్వర్లు సంస్మరణ సభ మంగళవారం తత్వశాస్త్ర విభాగం సమావేశ మందిరంలో జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు ప్రొఫెసర్ కె.ఎస్.చలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆచార్య వెంకటేశ్వర్లు చేసిన కృషిని వివరించారు.

మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు మాట్లాడుతూ ఆచార్య వెంకటేశ్వర్లుతో తనకున్న అరవయ్యేళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ప్రొఫెసర్ కృష్ణయ్య, ప్రొఫెసర్ సిమ్మన్న, ఆచార్య చందు సుబ్బారావు, డాక్టర్ నటరాజ్, డాక్టర్ కె.వి.ఎస్.కొచ్చెర్లకోట, వర్మ, తత్వశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఐసికిల్స్ ఆఫ్ ఇన్‌సైట్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆచార్యుడు డాక్టర్ ఎస్.రవి విన్సెంట్ రచించిన 'ఐసికిల్స్ ఆఫ్ ఇన్‌సైట్'కవితా సంకలనాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సృజనాత్మక రచనలు చేస్తున్న రచయితను అభినందించారు. అరుదైన శైలితో రచన చేయడం, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ జేమ్స్ స్టీఫెన్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ ఎస్.సాల్మన్‌బెన్నీ, డాక్టర్ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన బౌద్ధ భిక్షువు



బౌద్ధ భిక్షువును సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శ్రీలంకకు చెందిన బౌద్ధ సన్యాసి అమునుదోవే హేమసిరి థెరో మంగళవారం సందర్శించారు. వర్సిటీలోని గాంధీజీ అధ్యయన కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ తరపున బౌద్ధ భిక్షువును వీసీ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం బౌద్ధ అధ్యయనాలను ప్రోత్సహిస్తాం దన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీయన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ, విద్యా విభాగాధిపతి డాక్టర్ షారోన్ రాజు, సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



బాలికల వసతి గృహంలో మాట్లాడుతున్న భరణికాన రామరావు

ఆరిలోవ: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని పారిశ్రామిక వేత్త భరణికాన రామారావు అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూరల్ మండల కార్యాలయం సమీపంలో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొస్తున్నప్పటికీ బాలికలు మాత్రం హింసకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాసరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో బాలికలు చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ ఎ.వి.సునీత, డాక్టర్ బాబ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా 19వ వార్డు పెద జాలరిపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ల చిన్నారులు, స్థానిక ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఈ ర్యాలీలో నినాదాలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, విజయలక్ష్మి, చెల్లయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్: స్థానిక గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికా సాధికారతకు సంబంధించిన పలు వీడియోలను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, ఫిజికల్ డైరెక్టర్ జి.శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం హెల్త్ సిటీ రెయింబో ఆస్పత్రి గైనిక్ విభాగం వైద్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రి గైనికాలజిస్టులు డాక్టర్ రాగసుధ, డాక్టర్ ఎం.వి.ఆర్ శైలజ, డాక్టర్ నిహారిక నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలలను సందర్శించి బాలికల ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు.



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వుమన్ ఎంపవర్‌మెంట్ సెల్, జాతీయ సేవా పథకం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జయ మాట్లాడుతూ లింగ వివక్షత చూపించరాదని సూచించారు. అనంతరం పలు అంశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మాడుగుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చాడా శాస్త్రీ, వుమన్ ఎంపవర్‌మెంట్ సెల్ నిర్వాహకురాలు డాక్టర్.పి.శ్రీవాణి, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ రత్నభారతి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ వి.సుధీర్, డాక్టర్ టి.సామ్యూల్ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు వినతి



కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు జ్ఞాపిక అందజేస్తున్న విజయలక్ష్మి

మహారాణిపేట: గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థలం గానీ, వ్యాపార సముదాయ భవనం గానీ కేటాయించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి చంద్రమౌళి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు. విస్తరిస్తున్న విశాఖలో మరో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, ఏపీహెచ్‌డీసీ డైరెక్టర్ పైడి రమణ, విశాఖ లేపాక్షి మేనేజర్ విజయ గౌరి, సిబ్బంది దయానంద తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

29న సివిల్స్ శిక్షణకు టాలెంట్ టెస్ట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సాయిరాం

బీచ్ రోడ్డు: సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ నెల 29న టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్టు తక్షశిల ఐఏఎస్ అకాడమీ నిర్వాహకులు జి.సాయిరాం తెలిపారు. మంగళవారం టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెరిట్ స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు. ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఈ పరీక్షను సంపత్ వినాయక ఆలయం వెనకవైపు ఉన్న తమ సంస్థలో నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 99652 52252 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.